# కామన్ సెన్స్

A అడల్ట్స్ ఓన్లీ కథ!

సాధృతి

శుభలేఖ పెళ్ళికి పిలుపైతే, తొలిరేయి శుభదినాలకు ఆహ్వానం.. అందుకే తొలిరాత్రిని 'శోభనం' అన్నారు కాబోలు.

ఆ రోజు తనూహ, శ్రీదత్‌ల 'శోభనం'. మాఘ మాసపు మేఘం చాటు నుంచి చందమామ తొంగిచూస్తున్నాడు, ఆ కొత్త జంటని.

ఆ జంట చూడముచ్చటగా వుంది. కిటికీలోంచి బొండు మల్లెపూల సువాసన ఆ గది అలంకరణకి ప్రకృతి సహజమైన అందాన్ని అందిస్తుంది.

శ్రీదత్ మంచం మీద కూర్చుని ఆలోచిస్తున్నాడు. శ్రీదత్‌కు అసలు తొలిచూపు ప్రేమ మీద నమ్మకం లేదు. కానీ తనూహని చూసాక తన అభిప్రాయం పూర్తిగా మార్చుకున్నాడు. మరి తనూహ అందం, వ్యక్తిత్వం అలాంటివి.

'తనూహ' నిజంగా తన 'ఊహాసుందరి' లాగానే వుంది. అందుకే తన అభిప్రాయాన్ని మార్చుకుని సవ్యసాచిలా తన ప్రయత్నం అంతా తనూహని గెలుచుకోవడానికే ఉపయోగించాడు. ఆమెను మెప్పించి ఏరి కోరి వివాహం చేసుకున్నాడు.

సన్నగా మువ్వల శబ్దం అవటంతో ద్వారం వైపు చూసాడు. తనూహ తెల్లని చీరలో పాల గ్లాస్‌తో నడిచివస్తొంటే ఆమెనే మైమరపుగా చూస్తున్నాడు.

''ఏంటి అలా చూస్తున్నారు?'' అంది తనూహ.

శ్రీదత్ చిన్నగా నవ్వి ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. గోరింటాకు పెట్టిన తనూహ చేయి తామర పూవంత మెత్తగా వుంది. పచ్చగా మెరిసిపోతోంది. అతనికి తామిద్దరికీ పెళ్ళి అయిందని అది వాళ్ల తొలిరేయని నమ్మబుద్ధి కావటం లేదు.

తనూహ గిల్లిన గిల్లుడుకి 'అబ్బా' అన్నాడు.

''ఏంటి ఏదో ఆలోచిస్తున్నారు. అలా వింతగా చూస్తున్నారు? ఎప్పుడూ లేట్‌గా వచ్చే రైలు కోసం ఎదురు చూపులు చూస్తున్నట్లుఆ మొహం అలా పెట్టారేమిటి? నాకు తెలియక అడుగుతా అసలు మీరు 'శోభనం' గదిలో పెళ్ళికొడుకేనా?'' అంది.

శ్రీదత్ ఉక్రోషంగా అన్నాడు. ''ఏంటి ఆకాశవాణిలో వార్తలు చదువుతున్నట్లు అలా ఆగకుండా మాట్లాడతావేం? నువ్వసలు శోభనం గదిలో పెళ్లికూతురివేనా? నువ్వు సిగ్గుపడకపోతే నాకా 'ఫీలింగ్' ఎలా వస్తుంది?''

''ఓసి మీ ఫీలింగ్ బంగారం గాను.. అది కూడా నేనే తెప్పించాలా? నేను ఇంకా...'' ఇహ అంతే తనూహని మరి మాట్లాడనివ్వలేదు శ్రీదత్.


నలుగుపెట్టిన శరీరాలు నలగటానికే అన్నట్లుగా, వాళ్ళ శరీరాలు యుద్ధానికి సంసిద్ధమవుతున్నాయి. మనసులు ఆనందపు శిఖరాలని అధిరోహించటానికి అన్నట్లు ఆయత్తమైనాయి.

కోరికల అగ్నిజ్వాల రగిలి, సరసపు చిరుచెమటల తడి చిరుజల్లై కురియగా, ఆమె విభ్రమంలోను, అతను సంభ్రమంలోను మత్తుగా నిద్రలోకి జారుకుంటూ వుండగా మబ్బుచాటు చందమామ తన సర్వే అకౌంట్‌లో ఇంకో నంబర్ టిక్ చేసుకుని, తన పని అయిపోయినట్లు సాగిపోయాడు.

తొలిరేయి తెల్లారితే మలి రేయి రాదేమో అన్నంత గట్టిగా ఆమెను కౌగిలించుకు పడుకున్నాడు. కానీ కాలం ఆగదుగా, తెల్లవారింది.

★ ★ ★

తనూహ, శ్రీదత్‌లది ఒకే ఆఫీస్‌లో ఉద్యోగం. ఇద్దరూ ఆఫీస్‌కి రెడీ అయి బయలుదేరారు. ఆ కొత్త జంటని చూడటానికి కొలీగ్స్ అందరూ ఆత్రుతతో ఎదురుచూస్తున్నారు. ఎంత మామూలుగా వుందామన్నా ఏదో ఇబ్బందికరమైన 'ఫీలింగ్' అందరూ




తమనే చూస్తున్నారు అనిపిస్తోంది.

మేనేజర్ చారుశీల వచ్చి ''హాయ్ శ్రీదత్! కంగ్రాట్స్. ఎలా జరిగింది ఫస్ట్ నైట్? నువ్వు అవుట య్యావా, తను అవుటైందా? తనే అయి వుంటుం దిలే'' అంటూ తనూహ వైపు అసూయగా చూస్తూ శ్రీదత్ చేయి పట్టుకుని ఊపేసింది.

శ్రీదత్ చేయి నెమ్మదిగా వెనక్కి తీసుకుని నవ్వలేక నవ్వాడు. తనూహ ముఖంలో మార్పు స్పష్టంగా తెలుస్తుంది. అయినా తనని తాను కంట్రోల్ చేసుకోవటానికి విశ్వప్రయత్నం చేస్తూంది.

కొందరంతే, ఎదుటివాళ్ళ 'ఫీలింగ్స్'ని పట్టించుకోరు. వాళ్ళ భావాల్ని అవసరం లేకపోయినా, ఇతరులకి యిబ్బంది కలిగించినా సరే వ్యక్తపరుస్తారు. అదో గొప్ప అనుకుంటారు.



పైగా 'మేము చాలా ఫ్రాంక్ ఏదీ మనసులో దాచుకోము' అంటూ వాళ్ళ వీక్‌నెస్‌ని చాలా తెలివిగా కవర్ చేసుకుంటారు.

ప్యూన్ బాస్ బ్రీఫ్‌కేస్‌ని పైకి తీసుకువస్తున్నాడు. అంటే బాస్ త్రివిక్రమరావు వస్తున్నట్లు సిగ్నల్. అందరూ ఎవరి సీట్లలో వాళ్ళు కూర్చున్నారు. బాస్ రావడమే తనూహని పిలిపించాడు.

టేబుల్ మీద 'ది బాస్ ఈజ్ ఆల్‌వేస్ రైట్' అన్న షోపీస్ తమాషాగా తిప్పుతూ వున్నాడు బాస్. తనూహ గదిలోకి వెళ్ళేసరికి అతనో వింత మనిషి. ఇలాటి సామెతలని సరిగ్గా అర్థం చేసుకోకపోగా దాని అర్థమే మార్చేసే చాలామందిలో ఇతను ఒకడు. త్రివిక్రమరావు తనని తాను గొప్పగా ఊహించుకుంటాడు. అంతవరకు పరవాలేదుకానీ, అమ్మాయిలతో మాట్లాడటం ఒక కళ అని, అందులో తను 'నంబర్ వన్' అని అనుకుంటాడు. అందుకే అతనికి 'గ్యాస్ రావు' అన్న 'నిక్ నేమ్' కూడా వుంది.

తనూహని చూస్తూనే ''ఊ, ఏంటి? కళ్ళు ఎర్రగా వున్నాయి? రాత్రంతా నిద్రలేదా? శివరాత్రి జాగారమా? మీ వయసులో నేనూ అంతే. అఫ్‌కోర్స్ ఇప్పటికీ నేను అంతే అనుకో. ఇ...హి..హీ..'' అంటూ ఇంకా ఏదో మాట్లాడబోయాడు.

తనూహకి ఒళ్ళు మండింది. అయినా సర్దుకుని, ''నన్ను ఎందుకు రమ్మన్నారు సార్?'' అంది.

ఎంతైనా అనుభవశాలి. వెంటనే కంట్రోల్ అయిపోయి, ''ఏం లేదమ్మాయ్! మీ ఆయన అదే ఆ శ్రీదత్ నిన్ను ఏమైనా విసిగిస్తే నాకు చెప్పు. నేను చూసుకుంటాను'' అన్నాడు.

తనూహ బ్రెయిన్ పాదరసంలా పనిచేసింది. 'పెద్ద మొనగాడు' మనసులో అనుకుని, పైకి మాత్రం సన్నగా నవ్వుతూ ''నామీద మీకెంత అభిమానం సార్! నాకు మా నాన్నగారు గుర్తుకు వస్తున్నారు మిమ్మల్ని చూస్తుంటే. మా నాన్నే కనుక బ్రతికివుంటే అచ్చం ఇలాగే అనేవారు. ఇక నాకు దిగులు పడవలసిన అవసరం లేదు. నాకు ఏ ప్రాబ్లెమ్ వచ్చినా నేను ముందు మీకే చెప్తాను సార్. థాంక్యూ సార్'' అంటూ మారు మాట్లాడనివ్వకుండా కన్నీళ్ళు తుడుచుకుంటున్నట్లు నటిస్తూ బయటకు వెళ్ళి తన సీట్లో కూర్చుంది.

త్రివిక్రమరావు ఖంగుతిన్నాడు. ఎదురుగా టేబుల్ మీద గ్లాస్‌లో నీళ్ళు గటగటా త్రాగాడు.

శ్రీదత్ తనూహ సీటు దగ్గరికొచ్చి నెమ్మదిగా అడిగాడు.

''ఏమంటున్నాడు గ్యాస్?''

తనూహ అసలే విసుగ్గా వుంది- ''ఆ, నా చెయ్యి పట్టుకుని ఏమీ ఊపెయ్యలేదు కానీ మీరు వెళ్ళండి, మీ పని చూసుకోండి. నా సంగతి నేను చూసుకోగలను'' అంది కోపంగా. శ్రీదత్ హర్ట్ అయ్యాడు.

సాయంత్రం ఇద్దరూ ఇంటికి వచ్చారు. ఎవరూ మాట్లాడుకోవటం లేదు. ఎవరి పనులు వాళ్ళు మౌనంగా చేసుకున్నారు. తనూహ స్నానం చేసి టేబుల్ మీద భోజనం సిద్ధం చేసి వచ్చింది.

''రండి భోంచేద్దాం'' అంది.

''తనూ నాకు ఆకలిగా లేదు. నువ్వు తిని పడుకో'' అన్నాడు శ్రీదత్. తనూహకి సహనం నశించింది.

నిన్నటి పూల పాన్పు ఇవేళ అలక పాన్పు అయింది.

తనూహ గతంలోకి వెళ్ళింది. 'ఎంత వెంటపడి చేసుకున్నాడు తనని శ్రీదత్. మొదటినుంచి తన విషయంలో ఎంత పొసెసివ్‌గా వుండేవాడు. తను ఎప్పుడైనా లంచ్‌బాక్స్ తీసుకురాకపోతే అతని లంచ్‌బాక్స్ షేర్ చేసుకునేదాకా వూరుకునేవాడు కాదు. తనకి కాస్త వంట్లో బాగోలేకపోతే తన వర్క్ అంతా అతనే చేసి

## బంగారు గుమ్మడికాయ

**రొట్టె విరిగి నేతిలో పడడం అంటే ఇదేనేమో! కొంతమంది కొన్ని ఏళ్లపాటు శ్రమించాక కానీ రాని ఆఫర్లు మరికొంతమందికి ఒక్క సినిమాతో వచ్చేస్తుంటాయి. 'ది హీరో' చిత్రంలో చాలా కొద్ది నిముషాల నిడివిపాటు కనిపించే ప్రియాంకాచోప్రాకి ఇప్పుడెన్నో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చేశాయి. రాజీవ్ రాయ్ తన కొత్తచిత్రం 'అసంభవ్'లో హీరోయిన్ ప్రియాంకా అని అప్పుడే ప్రకటించేశాడు. ఇదిలా ఉండగా విక్రమ్‌భట్ దర్శకత్వం వహిస్తున్న కొత్త చిత్రంలో కూడా ప్రియాంకా ఛాన్స్ కొట్టేసింది. ఇప్పుడామె ఐశ్వర్య, సుస్మితలకి పోటీగా తయారైందంటున్నారు. వారు మాత్రం ప్రియాంక గురించి ఏమీ మాట్లాడడం లేదు.**

పెట్టేవాడు. మందులు కొని తెచ్చేవాడు. ఇంటి దగ్గర దిగబెట్టేవాడు. అసలు తమ పరిచయం స్నేహం అయి, ప్రేమకు దారి తీసి పెళ్ళితో ముడిపడటానికి కేవలం ఆరు నెలలు పట్టిందంతే! మరి పెళ్ళి అయి ఇరవై నాలుగు గంటలు కూడా కాలేదు. అంతలోనే ఇద్దరిమధ్య ఇలా గొడవ అవుతుందని తను అస్సలు ఊహించలేదు.

శ్రీదత్ లోపలికి వస్తున్న అలికిడికి తనూహ టక్కున అటు తిరిగి నిద్ర నటించింది.

''తనూ'' లాలనగా పిలిచాడు. పలుకు లేదు, ఉలుకూ లేదు.

''తనూ నీవు నిద్రపోవటం లేదని నాకు తెలుసు. ఇటు తిరుగు నీతో మాట్లాడాలి'' అన్నాడు.

తనూహ ఓరగా ఇటు తిరిగింది, అచ్చు సత్యభామలా వుంది ఆ భంగిమలో. శ్రీదత్ మనసు లయ తప్పింది. 'ఎందుకు ఎవరి కోసమో ఇంతటి ఆణిముత్యంలాంటి తన భార్యతో గొడవపడుతున్నాడు? నిజంగా తనో ఫూల్' అనుకుని ఆమెను మంచి చేసుకోవాలనుకున్నాడు. అతని మౌనాన్ని ఇంకోలా అర్థం చేసుకున్న తనూహ ''నాకు తెలుసు మీ మగాళ్ళ సంగతి. ఎన్ని వెధవ పనులు చేసినా రాత్రి అయ్యేసరికి ఎన్ని కబుర్లు అయినా చెప్తారు. ఎంతైనా దిగజారుతారు'' అనేసింది.

శ్రీదత్‌లో కూడా సహనం హద్దులు దాటింది. ఏదో కోరి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. అందరి లాంటి అమ్మాయి కాదు, కాస్త 'సెన్సిటివ్' అని తనే ఓ మెట్టు దిగి నచ్చ చెప్పటానికి వస్తే ఎంత చులకనగా మాట్లాడుతోందో!

''షటప్!'' అరిచాడు కోపంగా.

తనూహ కాస్త బెదిరింది.

''ఇప్పుడు నేను ఏం తప్పు చేసానని ఇలా రాద్ధాంతం చేస్తున్నావు? మేనేజర్ వచ్చి నా చేయి పట్టుకుంటే అది నా తప్పా?''

''ఆ గ్యాస్‌గాడు నీతో ఏమైనా పేలాడేమో అని అడిగితే అంత విసుగు ఎందుకు నీకు?''

తనూహ కూడా రంగానికి సిద్ధం అయింది.

''ఏం, ఆవిడ వచ్చి మీ చేయి పూపినప్పుడు వెర్రి చూపులు చూడకపోతే, నాకు ఇలాంటివి నచ్చవు మాడమ్. 'బీ ఇన్ యువర్ లిమిట్స్' అని అనలేకపోయారా? నేను మాత్రం బాస్ ఏమన్నదీ మీకు చెప్పాలా? మీకో నీతి, నాకో నీతా?'' ఆవేశంగా అంది.

''తనూ, నువ్వు చాలా ఫూలిష్‌గా మాట్లాడుతున్నావు. ఆమె మనకి మేనేజర్. అంత ఓపెన్‌గా నేను ఎలా ఆమెను ఎదిరించగలను?'' అన్నాడు.

''అవును. మీరు మాత్రం ఆమెను ఏమీ అనలేరు. నన్ను మాత్రం వేయికళ్ళతో గమనిస్తూ వుంటారు. ఏం ఆవిడ ప్రవర్తించినట్లు నేను ఇంకెవరితోనైనా ప్రవర్తిస్తే మీరు వూరుకుంటారా?'' అంది కసిగా.

''తనూ స్టుపిడ్‌లా మాట్లాడకు. అయినా తనకీ నీకూ పోలిక ఏమిటి అసహ్యంగా? అయినా ఆమె అలా బిహేవ్ చేస్తే అది నా తప్పా?'' అన్నాడు విసుగ్గా.

''ఖచ్చితంగా మీదే. మీ మగవాళ్ళ చాలా తెలివైన వాళ్ళు. సమయానికి తగు మాటలాడి చాలా తేలికగా ఎస్కేప్ అవుతారు. 'మగబుద్ధి' అని వూరికే అన్నారా?''

''నువ్వు మాట్లాడేదేమిటో నాకు అర్థం కావటం లేదు!'' అన్నాడు.

## లోగుట్టు

**ఇప్పుడు బాలీవుడ్ నిండా 'బూమ్'కబుర్లే! అయేషా ష్రోఫ్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి కైజాద్ గుస్తాద్ దర్శకుడు. షూటింగ్‌లో వచ్చిన చిన్న గొడవ కారణంగా ఈ సినిమానించి వైదొలిగిన దయానా హైడెన్ స్థానంలో మంచి గ్లామర్ తారని ఎంపికచేయనున్నట్టు తెలిసింది. 'ఆయనిప్పుడు రోజుకి ఇరవై నాలుగ్గంటలూ, వారానికి ఏడురోజులూ ఎంతో కష్టపడి పనిచేస్తున్నాడు' అని కైజాద్ ఫ్రెండ్ జావెద్ జెఫ్రీ చెబుతున్నాడు. దర్శకుడికి, దయానాకి మధ్య ఏం జరిగిందో 'లోగుట్టు పెరుమాళ్ళకెరుక' అన్నట్టుగా ఉంది.**



''చూడండి, నేను అమాయకురాల్ని అయివుండవచ్చు కానీ అజ్ఞానురాలిని మాత్రం కాదు. భార్య అంటే తల వంచుకుని తాళి కట్టించుకోవటమే కాదు, తప్పు చేసినప్పుడు తల ఎత్తి భర్తని సరైన మార్గంలో పెట్టాల్సిన బాధ్యత కూడా వుంది. అందుకే ఆ చనువుతోనే ఆ ప్రేమతోనే చెబుతున్నాను. దయచేసి అర్థం చేసుకోండి. మీ మగాళ్ళు ఓ చిన్న 'కాంప్లిమెంట్'తో ఆడదాన్ని పడేసి మీకు 'కన్వీనియంట్'గా రూటు ఏర్పరచుకోగలరు. ఓ ఆడది మీతో ఎలా ఎందుకు మాట్లాడుతోందో అర్థం కావటానికి ఓ గంట సంభాషణ ఆమెతో మీరు జరిపాక మీకు తెలిసిపోతుంది. నాకూ అంతే, ఓ మగాడు నాతో ఏమాశించి మాట్లాడుతున్నాడు అని తెలుసుకోవటానికి డిగ్రీలు అక్కర లేదండి. 'కామన్‌సెన్స్' చాలు. మన బాస్ కూడా చీకట్లో బాణం వేయాలని చూసాడు. కానీ నేను వెలుతురులో బాణం వేసాను. అది తగలాల్సిన చోటున తగిలింది. ఇక అతను నాతో అలా ప్రవర్తించడు అనే అనుకుంటున్నాను. ఇంకా నా జోలికి వస్తే ఎలా బుద్ధి చెప్పాలో నాకు తెలుసు. కానీ ఇక అంత అవసరం రాదనే అనుకుంటున్నాను.

మీరు కూడా ఎవరైనా మిమ్మల్ని అలా ఎప్రోచ్ అయితే నిర్మొహమాటంగా చెప్పేయాలి 'నాకు ఇలాంటివి నచ్చవు' అని. వాళ్ళు బాధపడతారని, మీరు ఇబ్బంది పడి నాతో గొడవ పడేకన్నా ఆదిలోనే కలుపుమొక్కల్ని తుంచేస్తే మేలు'' ఆగకుండా ఆవేశంగా మాట్లాడింది తనూహ.

శ్రీదత్‌లోని ముఖకవళికలు గమనిస్తూ మృదువుగా అంది, ''ఎవరి కోసమో మనం తగువుపడటం ఎందుకు చెప్పండి?''

ఒక్కసారి శ్రీదత్‌కి తన కళ్ళముందర తెర తీసినట్లు అయింది. నిజమే కదూ? ఈ కోణంలోంచి తను అసలు ఎప్పుడూ ఆలోచించలేదు. ఎంత చక్కగా చెప్పింది తనూహ! ఇక ఆలస్యం అమృతం విషయం అన్నట్లు గబగబా వెళ్ళి కంచంలో అన్నం, కూర వడ్డించుకుని వచ్చి తనూహకి, తినిపిస్తూ తను కూడా తిన్నాడు.

మరి భార్యాభర్తల మధ్య రాజీ కుదిరితే ఎవరు రాజ్యం ఏలుతారో చెప్పటం కష్టం. కాలం ఆగిందా లేక సాగిందా అని చెప్పటం కూడా కష్టమే. ఎటొచ్చీ పూలపాన్పుని అడిగితే మాత్రం బోలెడన్ని కథలు చెప్తుంది.

శ్రీదత్ గుండెలమీద హాయిగా పడుకున్న తనూహ చెవిలో గుసగుసగా అన్నాడు. ''దాంపత్యంలో పత్యం వుండకూడదు. ఇది మాత్రం కామన్‌సెన్స్‌తో తెలిసే విషయం కాదు సుమా?'' అతని కళ్ళలో మెరుపు, ఆమె బుగ్గలో ఎరుపు చూస్తూ చందమామ షరా మామూలుగా మేఘాలతో సాగిపోయాడు.

☆